

వైభవంగా భోగి పండుగ

● మొదలైన సంక్రాంతి సంబరాలు

పీలేరు, జనవరి 14: సంక్రాంతి పండుగ పర్వదినాల్లో తొలి అంకమైన భోగి పండుగను ఆదివారం జిల్లా ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఆదివారం వేకువజామునే సంప్రదాయబద్ధంగా తమ లోగిళ్ల ముందు భోగి మంటలు వేసి పండుగకు స్వాగతం పలికారు. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ భోగి సంబరాల్లో పాల్గొని ఆనందంగా గడిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

● 523.65 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

● వివరాలు వెల్లడించిన ఎస్పీ కృష్ణారావు



ముఠా సభ్యుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కృష్ణారావు

రాయచోటి టౌన్, జనవరి 14: జిల్లాలో ఆరు నెలలుగా పలు చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన ముగ్గురిని ఆదివారం రాయచోటి పోలీసులు అరెస్టు చేశారు. దొంగల ముఠాకు సంబంధించిన వివరాలను ఆదివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కృష్ణారావు మీడియాకు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్ జిల్లాలోని గుడిబండ తాలూకా పరలకుంట గ్రామానికి చెందిన కృష్ణప్ప రాజేశ్ ప్రస్తుతం చిత్తూరు జిల్లా పంజాని మండలం నీళ్లపల్లెలో నివాసం ఉంటున్నాడు. వీరు చిత్తూరు జిల్లా పలమనేరు టౌన్‌లోని సాయినగర్‌కు చెందిన తలారి హేమగిరి, మదనపల్లె పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన ఆవుల ప్రసాద్‌లు ముగ్గురూ కలిసి ఏడాది కాలంగా రాయచోటి, మదనపల్లె, రైల్వేకోడూరు, చిట్వేలి, చిన్నమండెం, సంబేపల్లె ప్రాంతాల్లో 15 చోట్ల ఇళ్ల తాళాలు పగులకొట్టి చోరీలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో వీరిపై నమోదైన కేసుల్లో దర్యాప్తు ప్రారంభించిన రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో రాయచోటి పట్టణ సీఐ సుధాకర్‌రెడ్డి, రూరల్ సీఐ తులసీరామ్, ఎస్ఐ మోహన్‌నాయక్‌లు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో రాయచోటి పట్టణ పరిధిలోని ఏజీ గార్డెన్ వద్ద పోలీసులను చూసి కారులో పారిపోతుండగా వెంబడించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి 33 లక్షల విలువ చేసే 523.65 గ్రాముల బంగారు ఆభరణాలు, 1545 గ్రాముల వెండితో పాటు మారుతీ సుజుకి కారు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పెట్టినట్లు ఆయన తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

పందేలకు సై



● పోలీసులకు ఫోన్లు వచ్చాయి..

● కోళ్ల కాళ్లకు కత్తులు మొలిచాయి..

● జిల్లా వ్యాప్తంగా జోరుగా కోడి పందేలు..

● బహిరంగంగానే.. బరులు

● ఆడుదాం ఆంధ్రాలో.. కోడిపందేలు చేర్చారా?



కోడిపుంజుకు కత్తి కడుతున్న కోడిపందెం రాయుళ్లు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): కోడిపందేలు.. ఆడడం.. ఆడించడం నేరం.. ఎక్కడో ఊరికి దూరంగా.. కొండల్లో.. గుట్టల్లో ఆడినా.. పదుల సంఖ్యలో పోలీసులు వెళ్లి పట్టుకుంటారు. కోళ్లను.. పందెంరాయుళ్లను స్టేషన్‌కు తరలిస్తారు.. పోలీసుల స్టైల్లో.. మర్యాద చేస్తారు.. ఇది మనందరికీ తెలిసిన విషయమే. అయితే ఆదివారం జిల్లా వ్యాప్తంగా విచ్చలవిడిగా.. బహిరంగంగానే.. కోడిపందేలు జరిగినా పోలీసులెవరూ.. అటువైపు కన్నెత్తి చూడలేదనే విమర్శలున్నాయి. జిల్లాలో ఎక్కడా కోడిపందేలపైన దాడులు చేయలేదు. ఒక కోడి నీ పట్టుకురాలేదు. దీని వెనుక..కారణం ఏంటా? అని ఆరా తీస్తే.. రెండు, మూడు రోజుల ముందు అధికార పార్టీ నాయకుల నుంచి పోలీసు పెద్దలకు ఫోన్లు వెళ్లినట్లు తెలిసింది. సంక్రాంతి పండుగ.. మా పార్టీ నాయకులు పలుచోట్ల కోడిపందేలు ఆడించుకుంటామంటున్నారు.. ఎన్నికలు మూడు నెలలు కూడా లేవు. మా ఇబ్బందులు గమనించండి.. ఈ రెండు రోజులు.. చూసీ చూడనట్లుగా ఉండండి.. అని చెప్పినట్లు సమాచారం. అధికార పార్టీ పెద్ద నాయకుల నుంచి స్పష్టమైన హామీ రావడంతో పందెంకోళ్ల కాళ్లకు కత్తులు మొలిచాయని పందెంరాయుళ్లు సంబర పడుతున్నారు. అయితే ఆడుదాం.. ఆంధ్రలో కోడి పందేలను కూడా చేర్చారా...? అందుకే ఎటువంటి ఆటంకాలు లేకుండా కోడి పందేలు ఆడిస్తున్నారా? అని సామాన్య జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

సంక్రాంతి పండుగ సందర్భంగా సాధారణంగా రెండు తెలుగు రాష్ట్రాలలో కోడిపందేలు, ఎద్దుల పందేలు, కొన్నిచోట్ల పందుల పందేలు, గుండాట.. వంటి అనేక పందేలు ఆడడం సర్వసాధారణం. ఇదే కోవలోనే.. జిల్లాలో కూడా మారుమూల ప్రాంతాలలో కోడి పందే లు జరుగుతాయి. అయితే జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత కోడి పందేలు కూడా సంక్రాంతికి బహిరంగంగానే అధికార పార్టీ నాయకులు జరుపుతున్నారు. గత ఏడాది కోడిపందేలు ఆడినా.. ఆడించినా.. కఠిన చర్యలు తప్పవంటూ పోలీసులు పందెంరాయుళ్లను స్టేషన్‌కు పిలిపించి గట్టిగా హెచ్చరించారు. పండుగ పది రోజుల ముందుగానే జిల్లా వ్యాప్తంగా కోడిపందెం రాయుళ్లను స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ చేశారు. అయితే ఈసారి అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల ప్రభావం తో పోలీసులు కోడిపందేలకు గేట్లు ఎత్తేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధార రహదారులు, ఊర్లకు సమీపంలో సైతం కోడి పందేలు ఆడించారు. ఈ పందేలకు వందల సంఖ్యలో పందెం రాయుళ్లు హాజరయ్యారు. దాదాపు జిల్లా వ్యాప్తంగా చాలాచోట్ల ఈ పందేలు జరిగినట్లు తెలుస్తోంది. సంబేపల్లె మండలంలోని దేవపట్ల, శెట్టిపల్లె, మిన్నమరెడ్డిగారిపల్లె, గున్నికుంట్ల గ్రా మాల్లో యథేచ్ఛగా కోడిపందేలు జోరుగా కొనసాగాయి. ఒక్కో స్థావరంలో రెండు బరులు ఏర్పాటు చేసి కోడిపందేలు నిర్వహించారు. ఈ పందేల్లో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. సంబేపల్లె పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ పందేలు జరిగినా.. అటువైపు పోలీసులు కన్నెత్తి చూడలేదు. రాయచోటి మండలంలో సైతం ప్రధాన రహదారికి సమీపంలోనే పందేలు జరిగాయి. గుర్రంకొండ మండలంలోనూ బహిరంగంగానే కోడిపందేలు జరిగాయి. రాజంపేట, రైల్వేకోడూరు, తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాల పరిధిలో సైతం కోడి పందేలు జరిగాయి. కోడి పందేలు జరుగుతున్న వీడియోలు హల్‌చల్ చేసినా పోలీసులకు చీమకుట్టినట్లైనా లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సంబేపల్లె మండలంలో సామాజిక మాధ్యమాల్లో కోడి పందెంపై హల్చల్ అవుతున్నప్పటికీ పోలీసు సిబ్బంది కోడి పందెం స్థావరాలపై దాడి చేయకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించినా.. ఆదివారం జిల్లాలో పలుచోట్ల కోడిపందేలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఆడుదాం..ఆంధ్ర పేరుతో.. రూ.కోట్లు ఖర్చు చేసి.. ఓట్ల కోసం కార్యక్రమం చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి పెద్ద గా స్పందన కనిపించడం లేదు. క్రికెట్, కబడ్డీకి తప్ప.. మిగిలిన క్రీడలకు ఏమాత్రం స్పందనం ఉండడం లేదు. ఈ నేపథ్యంలో.. ఆడుదాం.. ఆంధ్రలో.. సంక్రాంతి స్పెషల్‌గా.. కోడిపందేలకు కూడా చోటు కల్పించారేమో..? అని ప్రజలు బహిరంగంగా వ్యాఖ్యానిస్తుండడం విశేషం.



సంబేపల్లెలో కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరం

వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యం

● టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

● వైసీపీ నుంచి టీడీపీలో 40 కుటుంబాలు చేరిక



వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన వారితో చమర్తి జగన్‌మోహన్‌రాజు

ఒంటిమిట్ట, జనవరి 14: వైసీపీ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు విమర్శించారు. ఆదివారం మండల పరిధిలోని పోలు బుచ్చయ్యగారిపల్లెలో ఆయన విస్తృతంగా పర్యటించారు. పోలు బుచ్చయ్యగారిపల్లె గ్రామంలోని వైసీపీకి చెందిన నల్లగొండు గంగిరెడ్డి, నల్లగొండు శేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, చిన్నగంగిరెడ్డి కొండారెడ్డి అనుచరులు 40 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి జగన్‌మోహన్‌రాజు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని, పరిపాలన చేతగాని దద్దమ్మ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని విమర్శించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం చేతకాకపోవడంతో ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, రాబోయే ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. టీడీపీ-జనసేన పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో హరినాథరెడ్డి, శివారెడ్డి, మామిళ్ల శ్రీహరి, మోదుగుల నరసింహులు, బొడిచర్ల శ్రీనివాసులు, డాక్టర్ శివకుమార్, రాచపల్లి జగన్‌మోహన్‌రాజు, రాచపల్లి చౌడయ్య, సాలాబాదు చౌడయ్య, వెంకటరమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బాలకృష్ణ, కాంట్రాక్టర్‌మధుసూదన్, నడింపల్లె మౌలాలి, ఎస్సీ నేత వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని 10 వేల మందితో అజ్మీర్ యాత్ర

● రూ.కోటి చెక్కు అందించిన టీడీపీ నేత అమరనాథ్

మదనపల్లె టౌన్, జనవరి 14: రాష్ట్రానికి చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని మదనపల్లె నియోజకవర్గం నుంచి 10 వేల మంది ముస్లింలకు అజ్మీర్ యాత్ర చేయించేందుకు రూ.కోటి విరాళం చెక్కును మదనపల్లె టీడీపీ నేత కోడికొళ్ల అమరనాథ్ అందజేశారు. ఆదివారం స్థానిక బెంగళూరు బస్టాండులోని బడేమకాన్ దర్గా వద్ద ముస్లిం పెద్దలతో కలసి చంద్రబాబు సీఎం కావాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అమరనాథ్ మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గంలోని మూడు మండలాల్లోని ముస్లింలను అజ్మీర్ యాత్ర చేయించేందుకు రవాణా, భోజన, వసతిలకు సంబంధించి తానే సొంత నిధులతో పంపుతున్నానని తెలిపారు. ఆసక్తి గల ముస్లింలు తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. దీంతో పాటు నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో అనేక పాపాలు చేసి ప్రజలను మోసగించారని, ఈ పాప ప్రక్షాళన కోసం నియోజకవర్గం నుంచి 20 వేల మంది హిందువులకు కాశీయాత్ర చేయించేందుకు ఈనెల 23వ తేదీ నుంచి పేర్లు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం బెంగళూరుకు చెందిన ట్రావెల్ ఏజెంట్ మహబూబ్‌బాషాకు రూ.కోటి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో అజ్మీర్ దర్గా ప్రతినిధి తస్లీమ్ బాషా, రాయల్ గని, హేమచంద్ర తదితరులు పాల్గొన్నారు.



అజ్మీర్‌యాత్ర ఖర్చులకు రూ.కోటి చెక్కు అందజేస్తున్న టీడీపీ నేత అమరనాథ్

బెంగళూరులో చోరీ.. కలికిరిలో విక్రయం

● 40 స్కూటీలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కలికిరి, జనవరి 14: బెంగళూరులో చోరీ చేసుకొచ్చి కలికిరిలో విక్రయించిన స్కూటీలను కర్ణాటక పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఒక్కరోజే 40 స్కూటీలను స్వాధీనం చేసుకోగా మరిన్ని వాహనాలను గుర్తించాల్సి ఉందని తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బెంగళూరు పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి చోరీ చేసిన స్కూటీలను భారీగా కలికిరిలో విక్రయించారు. కలికిరి ఇందిరమ్మ కాలనీకి చెందిన ఫయాజ్ బెంగళూరులో పెయింటర్ వృత్తిలో ఉన్నాడు. బెంగళూరుకు చెందిన సికిందర్, ఖయూమ్‌లతో ఫయాజ్‌కు పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ ద్విచక్ర వాహనాలను చోరీ చేయగా ఫయాజ్ వాటిని కలికిరి పరిసర ప్రాంతాలకు చెందిన వారికి విక్రయిస్తుండేవాడు. ఫైనాన్స్ కంపెనీలు స్వాధీనం చేసుకున్న వాహనాలను వేలంలో తక్కువ ధరకు కొనుక్కొచ్చినట్లు స్థానికులను ఫయాజ్ నమ్మించాడు. దీంతో చౌకగా వస్తున్నాయని ఆశపడి ఎడాపెడా కొనేశారు. వీటి కోసం కొంతమంది ఫయాజ్ వద్ద ప్రీ బుకింగ్ కూడా చేసుకున్నట్లు సమాచారం. విడతల వారీగా వీరందరికీ వాహనాలు విక్రయించినట్లు తెలుస్తోంది. బెంగళూరు నార్త్ జేపీనగర్ ఏరియాలో వందల కొద్దీ వాహనాలు అదృశ్యమైన సంఘటనలకు సంబంధించి ఫిర్యాదులు అందడంతో అక్కడి పోలీసులు ప్రత్యేక టీం ఏర్పాటు చేసి కూపీ లాగారు. దీంతో కలికిరికి చెందిన ఫయాజ్ ఇక్కడ విక్రయించినట్లు తేల్చారు. ఇప్పటికి మొత్తం 40 వాహనాలను స్వాధీనం చేసుకోగా మరో యాభై వరకూ కూడా ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సీఐ చైతన్య, ఎస్ఐ అన్నపూలు తమ సిబ్బందితో స్థానికంగా మకాం వేసి కూపీ లాగడంతో భారీగా వాహనాలు పట్టుబడ్డాయి. నిందితుడు ఫయాజ్‌తో పాటు 40 వాహనాలను పోలీసులు బెంగళూరుకు తరలించారు.



బెంగళూరు పోలీసులు స్వాధీనం చేసుకున్న స్కూటీలు

రైలు కింద పడి జంట ఆత్మహత్య

● ఆర్థిక సమస్యలతో మరొకరు



పాలకొండ్రాయుడు(ఫైల్), చందనారెడ్డి (ఫైల్)

కడప(క్రైం), జనవరి 14: సహజీవనం చేస్తున్న ఓ జంట కడప రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న కడప రైల్వే ఎస్ఐ రారాజు ఆధ్వర్యంలో మృత దేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఎస్ఐ వివరాల మేరకు.. కడప రవీంద్రనగర్‌కు చెందిన పాలకొండ్రాయుడు (26) ఆరోగ్యశ్రీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. నెహ్రూనగర్‌కు చెందిన చందనారెడ్డి (36) భర్తతో విడిపోయి, అక్కడే ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటోంది. వీరిరువురికి కొన్ని నెలల కిందట ఏర్పడిన పరిచయం సహజీవనానికి దారి తీసింది. ఇటీవల ఇద్దరి మధ్య మన స్పర్థలు ఏర్పడ్డాయి. ఈ జంట పోలీసు స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేసుకోవడంతో పోలీసులు కౌన్సెలింగ్ చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఇద్దరూ రైల్వేస్టేషన్‌కు వెళ్లి రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే ఇందుకు గల కారణాలు తెలియాల్సి ఉందని, ఇద్దరి బంధువుల నుంచి పూర్తి వివరాలు తెలుసుకుని ఈ మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

రాయచోటి రోడ్డులోని రైల్వే గేటు వద్ద కడప ఐటీఐ ప్రాంతానికి చెందిన షేక్ ఖదీర్ (36) రైలుకింద పడి ఆత్మహత్యా యత్నం చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు. కొంత కాలంగా ఖదీర్ కుటుంబ ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఈ నేపథ్యంలో ఆదివారం రైలు కింద పడడంతో కాళ్లు చేతులు కట్ అయ్యాయని, వైద్యపరీక్షల నిమిత్తం రిమ్స్‌కు తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం



మాంగల్య ధారణను భక్తులకు చూపిస్తున్న అర్చకులు

వల్లూరు, జనవరి 14: ప్రసిద్ధిగాంచిన పంచమనదీ సంగమంలో కొండలో వెలసియున్న లక్ష్మీ చెన్నకేశవస్వామి సన్నిధిలో బోగి పండుగ పురస్కరించుకుని ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే మూలవిరాట్‌ను శ్రీరాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ సంతాన మల్లేశ్వరులకు అభిషేకాలు నిర్వహించి సుందరంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి కల్యాణ వేదిక వద్దకు మేళతాళాలతో వేదిక వద్దకు తీసుకువచ్చారు. అనంతరం వేద పండితులు ఆలయ అర్చకులు అఖిల్‌దీక్షితులు కల్యాణం ప్రారంభించారు. అనంతరం కంకణ ధారన గావించారు. అనంతరం కన్యాదానం చేపట్టారు. జిలకర బెల్లంను దేవమూర్తుల శిరస్సుపై ఉంచారు. అనంతరం మంగళసూత్రాన్ని గోదాదేవి మెడలో అలంకరింప జేశారు. అనంతరం ముత్యాల తలంబ్రాలను పోశారు. అంతకు ముందు గోదాదేవి కల్యాణ విశిష్టతను భక్తులకు వినిపించారు. కల్యాణం అనంతరం భక్తులందరికీ అన్నప్రసాదం అలయ ఈఓ, ఆలయ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అందించారు.

గోవానుంచి ప్రొద్దుటూరుకు అక్రమ మద్యం

● 161 మద్యం బాటిళ్లు పట్టుకున్న రూరల్ పోలీసులు

● ముగ్గురు అరెస్టు, ఇన్నోవా వాహనం సీజ్




వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ ప్రేర్ణకుమార్ పక్కన, సీఐ, ఎస్ఐ

ప్రొద్దుటూరు, జనవరి 14: గోవా నుంచి ప్రొద్దుటూరుకు భారీగా అక్రమ మద్యం రవాణా చేస్తున్న ముగ్గురిని ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం మధ్యాహ్నం ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోని పెద్దశెట్టి పల్లె క్రాస్‌వద్ద సీఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు వైపు వస్తున్న ఇన్నోవా వాహనాన్ని తనిఖీచేయగా అందులో గోవాకు చెందిన 161 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం రూరల్ పోలీసుస్టేషన్లో ఏఎస్పీ ప్రేర్ణకుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు రూరల్ పోలీసుస్టేషన్ లిమిట్స్‌లోని పెద్ద శెట్టిపల్లె క్రాస్‌వద్ద జమ్మలమడుగు రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా జమ్మలమడుగునుంచి ప్రొద్దుటూరుకు వస్తున్న ఇన్నోవా వాహనంలో గోవా రాష్ట్రానికిచెందిన 161 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యం అక్రమ రవాణ చేస్తున్న ముగ్గురుని రూరల్ సిఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారన్నారు. కట్టం వీరేంద్ర, కోగటం షరీఫ్, వడ్ల వెంకట నాగచైతన్య ఆచారి ఈ ముగ్గురిపై కేసు నమోదు చేసి ఇన్నోవా వాహనం సీజ్ చేశామన్నారు. సమావేశంలో రూరల్ సీఐ రమణారెడ్డి , ఎస్ఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

హరిప్రసాద్ ఆధ్వర్యంలో భారీ విందు

● అన్ని వర్గాల ప్రజలు, నేతలు హాజరు



హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న అమీర్‌బాబు, నజీర్‌అహ్మద్ తదితరులు

కడప(ఎర్రముక్కపల్లె), జనవరి 14: మత సామరస్యానికి ప్రతీక కడప జిల్లా అని చెప్పాలి. జిల్లాలో ఏ పండుగ జరిగినా హిందూ, ముస్లిం, క్రైస్తవులు అందరూ కలిసి చేసుకోవడం ఆనవాయితీ. ఆదివారం కడప నగరం హరిటవర్స్‌లో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ ఆధ్వర్యంలో భారీ విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు టీడీపీ నేతలు పుత్తా నరసింహారెడ్డి, ఆర్.శ్రీనివాసరెడ్డి, ఆర్.మాధవీరెడ్డి సహా వివిధ పార్టీల నేతలు, అన్నివర్గాల నగర ప్రముఖులు పాల్గొన్నారు. వారికి హరిప్రసాద్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడుతూ ఏటా సంక్రాంతి విందు ఏర్పాటు చేస్తామన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా అన్ని మతాల వారు ఈ విందుకు హాజరై పండుగను చేసుకుంటామని తెలిపారు.

అలరిస్తున్న సురభి నాటకాలు

● రెండో రోజు భక్తప్రహ్లాద నాటకం



పులివెందులలో భక్తప్రహ్లాద నాటక దృశ్యం

పులివెందుల, జనవరి 14: పులివెందుల గరండాల్ రివర్ ఫ్రంట్‌లో సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన సురభి నాటకాలు అలరిస్తున్నాయి. రెండో రోజు ఆదివారం భక్తప్రహ్లాద నాటకం వేయగా కళాకారుల నటనకు ప్రేక్షకులు మంత్రముగ్ధులై పోయారు. సురభి నాటక రంగ ఖ్యాతిని చాటిచెప్పేలా ప్రదర్శనలు సాగుతుండడంతో ఆద్యంతం చూసి ఆనందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, పట్టణ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా

కొండాపురం, జనవరి 14: కొండాపురం సమీపంలో ప్రధాన రహదారిపై కడప వైపు వెళుతున్న ఐరన్‌ఓర్ లారీ ఆదివారం అదుపుతప్పి బోల్తాపడింది. ఎదురుగా వస్తున్న మరో లారీని తప్పించబోయి ఐరన్‌ఓర్ లారీ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. అదృష్టవశాత్తు ఎవరికి ప్రాణాపాయం జరగలేదు.

పేదలకు దుస్తుల పంపిణీ

రామాపురం, జనవరి 14: మండల కేంద్రంలోని తన స్వగృహంలో టీడీపీ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ భోగి పండుగ భోగ భాగ్యాలు ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాధవిరెడ్డి, అంజనరెడ్డి, శంకర్, రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

పులివెందులలో జోరుగా కోడిపందేలు

● కోట్లలో పందేలు



పులివెందుల మండలం ఇ.కొత్తపల్లెలో తలపడుతున్న కోళ్లు

పులివెందుల రూరల్, జనవరి 14: పులివెందుల పరిధిలోని పలు ప్రాంతాల్లో కోడిపందేలు జోరుగా సాగాయి. సంక్రాంతి పర్వదినం సందర్భంగా సంప్రదాయంగా జరిగే కోళ్ల పందేలు జూదంగా మారాయన్నది బహిరంగ రహస్యమే. సంక్రాంతి వస్తుందంటే చాలు ఏడాది నుంచే కొందరు జూదగాళ్లు కోళ్ల పెంపకం సాగిస్తుంటారు. జంతుహింస నిరోధక, ఏపీ జూద నిరోధక చట్టాలు ఉన్నప్పటికీ అమలు చేసే వారు కరువయ్యారని చెప్పవచ్చు. చట్టాలు అమల్లోకి వచ్చినప్పటి నుంచీ ఈ జూదాన్ని ఎక్కడికక్కడ కట్టడి చేయాలనే పోలీసు అధికారుల అడుగు ముందుకు పడడం లేదని స్పష్టమవుతోంది. అధికార పార్టీ నేతలు, రాజకీయ నేతల అండదండలు వీటికి పుష్కలంగా ఉన్నట్లు విమర్శలున్నాయి. పోలీసులు అటువైపు రాకుండా అధికారబలంతో అడ్డుకట్ట వేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో అధికారిక కోడిపందేలను రాజకీయ నేతలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మండలంలోని ఇ.కొత్తపల్లెలో భోగి పర్వదినం సందర్భంగా కోడిపందేలు నిర్వహించినట్లు తెలిసింది. పోలీసులను, విలేకరులను అటువైపు వెళ్లనివ్వకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. దాదాపు వందకు పైగా కోళ్ల పందేలలో తలపడినట్లు, రూ.కోట్లలో పందేలు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. పులివెందుల రాజకీయ నేతలే కాకుండా చుట్టు పక్కల మండలాల నుంచి పెద్దసంఖ్యలో కోడిపందెంరాయుళ్లు వెళ్లినట్లు తెలిసింది. అంతే కాకుండా చుట్టుపక్కల కొండలు, గుట్టలు, ఊరిబయట ప్రాంతాల్లో కోడిపందేలు నిర్వహించారని సమాచారం.

కన్నుల పండువగా గోదాదేవి, శ్రీకృష్ణుల కల్యాణం





బొల్లవరం ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం, కల్యాణ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

ప్రొద్దుటూరుటౌన్, జనవరి 14: పట్టణంలోని వివిధ ఆలయాల్లో గోదాదేవి, శ్రీకృష్ణుల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. పాత మార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు అనంతరం తిరుప్పావై పాశురాలను పఠించారు. తెలుగు పండితులు మద్దిలేటయ్య పురాణ పఠనం చేశారు. గోదాదేవి, రంగనాయకుల స్వామికి విశేష పూజలు నిర్వహించి వేద పండితులు సుముహూర్తంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. బొల్లవరంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి, శ్రీకృష్ణుల కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. మనోజీ రావు వృధిలోని రుక్మిణి పాండురంగస్వామి ఆలయం, శ్రీకృష్ణాలయం, మైదుకూరు రోడ్డులోని పాండురంగ స్వామి ఆలయంలో గోదాదేవి, శ్రీకృష్ణుల కల్యాణోత్సవం నిర్వహించారు.

భోగిమంటల్లో జీవో ప్రతుల దహనం

● యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

కడప(ఎర్రముక్కపల్లె), జనవరి 14: ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిరంకుశ, నిర్బంధ తీరు నశించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు ఆరోపించారు. ఆదివారం బోగి పండుగ సందర్భంగా స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బోగి మంటల్లో చీకటి జీఓ ప్రతులను దహనం చేశారు. అనంతరం మాట్లాడుతూ న్యాయబద్ధంగా తమకు రావలసిన ఆర్థిక బకాయిలను ప్రభుత్వం చెల్లించకుండా కాలయాపన చేస్తూ ఉద్యోగ ఉపాధ్యాయులను వేధించడం మంచిది కాదన్నారు. ఉపాధ్యాయుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేక విధానాలు నేటితో నశించి సంక్రాంతి పండుగ పురస్కరించుకుని డీఏ, పీఆర్సీ, సరెండరు లీవు, ఏపీజీఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంటు, సీపీఎస్ ఉద్యోగుల అరియర్స్ తదితర బకాయిలన్నీ చెల్లించాలని కోరారు. 15 రోజులుగా తాలుకా స్థాయిలో ఆరుగంటల ధర్నా, జిల్లా స్థాయిలో 12గంటల ధర్నా, రాష్ట్ర స్థాయిలో 36గంటల ధర్నా యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. తాము పొదుపు చేసుకున్న పీఎఫ్‌కు సంబంధించిన రూ.3వేల కోట్ల బకాయిలు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని, మిగిలిన రూ.15 వేల కోట్లు బకాయిల విడుదలలో నిర్లక్ష్యం వహించిందన్నారు. సంక్రాంతి పురస్కరించుకుని బకాయిలన్నీ ప్రభుత్వం త్వరిత గతిన చెల్లించాలని లేదంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని, ప్రభుత్వం మెడలు వంచైనా న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు నరసింహారావు, సీవీ రమణ, ఎజాజ్ అహ్మద్, ప్రభాకర్, గంగన్న, శంకర్‌బాబు, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, విశ్వనాథ్‌తో పాటు పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భూ హక్కు చట్టం ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

సీపీఐ నేతల ఆధ్వర్యంలో

కడప(సెవెన్‌రోడ్స్), జనవరి 14: సీఎం జగన్ ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన శాశ్వత భూ హక్కు చట్టం జీఓ ప్రతులను సీపీఐ నేతలు బోగి మంటల్లో దహనం చేశారు. ఆదివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద భోగిమంటల్లో జీఓ ప్రతులు దహనం చేసిన అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన శాశ్వత భూ హక్కు చట్టం వెనుక రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ఆక్రమించి అమ్ముకుని సొమ్ము చేసుకునే కుట్ర దాగి ఉందని, భూబకాసురుల చట్టం ఉపసంహరించుకునే వరకూ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. గతంలో భూమిలేని నిరుపేదలకు బంజరు భూములు పంపిణీ చేసేందుకు పాలక ప్రభుత్వాలు అసైన్‌మెంట్ కమిటీల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు భూములు కేటాయించారన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, ఐఏఎల్ జిల్లా కార్యదర్శి సి.సుబ్రహ్మణ్యం, సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాసురేశ్ పాల్గొన్నారు.

చెన్నముక్కపల్లిలో సంక్రాంతి క్రికెట్ పోటీలు

రాయచోటిటౌన్, జనవరి 14: మండల పరిధిలోని చెన్నముక్కపల్లెలో సంక్రాంతి సందర్భంగా ఆదివారం ఏపీఐఐసీ డైరెక్టర్ రాయవరం శ్రీనివాసులరెడ్డి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. క్రీడాకారులతో పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి కింద రూ.30,016లు, రెండవ బహుమతి రూ. 20,016లు నగదు బహుమతితో పాటు మెమెంటోలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, టోర్న మెంట్ ఆర్గనైజర్స్ ఉదయ్‌కిరణ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, సురేశ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



చెన్నముక్కపల్లెలో క్రికెట్‌లో పోటీలను ప్రారంభిస్తున్న ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి

పండుగ పూట ఎస్టీ కాలనీలో విషాదం

ఓబులవారిపల్లె, జనవరి 14: మండలంలోని నూకనపల్లె ఎస్టీ కాలనీలో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలనీలోని వెలుగు నరసింహులుకు చెందిన బోద కొట్టానికి నిప్పంటుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో 12వేల రూపాయల నగదు, బంగారం కలిపి సుమారు రూ. 70 వేల మేరకు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. ఈ కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని తెలిపారు.

మాధవరం కస్బాలో ముగ్గుల పోటీలు

రాయచోటిటౌన్, జనవరి 14: మండల పరిధిలోని మాధవరం కస్బాలో ఆదివారం గుది మారతి ఫౌండేషన్ చైర్మన్ సతీమణి గుది మౌనీషా ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముగ్గుల పోటీల ద్వారా తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడ్డాయన్నారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు హుస్సేన్, కనిసనేని మహేంద్ర, సతీశ్, నరేశ్, సునీల్‌రాయల్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో సంక్రాంతి కానుక అందజేత

సిద్దవటం, జనవరి 14: భోగి పండుగ సందర్భంగా మండలంలోని కాలకొండ్రాయునిపల్లెలో ఆదివారం టీడీపీ నాయకుడు కుప్పాల వెంకటసుబ్బయ్య పేదలందరికీ సంక్రాంతి కానుక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 400 మందికి నిత్యావసర సరుకులు అందజేసినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం ఇలాగే నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేశం పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

రాయచోటిటౌన్, జనవరి 14: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం రాయచోటి పట్టణ పరిధిలోని మదనపల్లె రోడ్డు మార్గంలో వీఆర్ స్కూల్ సమీపంలో మారుతీ గుది ఫౌండేషన్ ఆధ్వర్యంలో అట్టహాసంగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ కుమారుడు మౌద్విక్, దేవేంద్రరెడ్డి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు గజ, జ్ఞానేంద్రరెడ్డి, మద్దిపట్ల శేఖర్, వెంకటప్రసాద్, దేరంగుల అనిల్, అమరేశ్వర్‌రెడ్డి, అనిల్, శ్రీనివాసులు, సుజుకి, రెడ్డెయ్య, నవీన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందెంరాయుళ్లు అరెస్టు



కోడి పందెంరాయుళ్లను అరెస్టు చేసిన పోలీసులు

రైల్వేకోడూరు, జనవరి 14: మండలంలో కోడి పందెం ఆడుతున్న స్థావరాలపై రైల్వేకోడూరు పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే కోడూరు ఎస్ఐ-2 వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో కోడిపందెం ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశామని, 3 కోళ్లు, రూ.1660 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. కోడి పందేలపై నిరంతరాయంగా నిఘాలు ఉన్నాయని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైతు ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరు చోరీ

కొండాపురం, జనవరి 14: మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో శుక్రవారం రాత్రి రంగనాయకులు అనే రైతుకు చెందిన పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరు చోరీకి గురైంది. ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి రాగివైరు దొంగలించినట్లు రైతు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

'ఆర్థిక నేరస్తుడు జగన్‌రెడ్డి.. మచ్చలేని నేత చంద్రబాబు'

రాయచోటిటౌన్, జనవరి 14: దేశంలోనే అతి పెద్ద ఆర్థిక నేరస్థుడు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా ఆరోపించారు. ఆదివారం ఆయన రాయచోటి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి ఇలాగే చంద్రబాబుపై కూడా అక్రమ కేసులు పెట్టినా.. ఒకటి కూడా రుజువు చేసుకోలేకపోయాడన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి టీడీపీ అధినేత చంద్రబాబును అక్రమంగా 53 రోజులు జైల్లో పెట్టి తద్వారా తెలుగుదేశం పార్టీ నాయకులను భయపట్టేందుకు పన్నాగం పన్నాడని ఆరోపించారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ప్రపం చంలోని 73 దేశాలు సంఘీభావం తెలిపాయన్నారు. జగన్‌రెడ్డిని 16 నెలలు జైల్లో పెడితే ఎవరూ రోడ్లమీదకు రాలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మాదిరిగా చంద్రబాబు నాయుడు ధర్నాలు, ర్యాలీలను అడ్డుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షులు అమీర్‌జాన్, ప్రచార కార్యదర్శి ఎస్ఎండీ రఫీ, వార్డు అధ్యక్షుడు ఫజిల్, సనావుల రాజు తదితరులు పాల్గొన్నారు.











భోగి మంటల్లో ఎస్మా ప్రతుల దహనం


రాయచోటి: జీవో ప్రతులను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, అంగన్వాడీ వర్కర్లు


రైల్వేకోడూరులో జీవో-2 ప్రతులను చూపుతూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు


లక్కిరెడ్డిపల్లె: జీవో ప్రతులను భోగి మంటల్లో కాల్చేస్తున్న అంగన్వాడీలు


రాజంపేట: ఎస్మా కాపీలను భోగిమంటలో వేసి దహనం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాయచోటిటౌన్, జనవరి 14: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ హక్కుల చట్టంతో పాటు అంగన్వాడీలపై ప్రయోగిస్తామంటున్న ఎస్మా ప్రతులను ఆదివారం ప్రజా సంఘాల నేతలు అంగన్వాడీ వర్కర్లు, రాయచోటి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద భోగిమంటల్లో వేసి దహనం చేశారు. జగన్ ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రజా వ్యతిరేక చట్టాలను, జీవోలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని, జగన్ ప్రభుత్వం ఏ జీవో తీసుకొచ్చినా రాజ్యాంగ విరుద్ధమైనదిగానే ఉన్నదని, ఇలాంటి వారు ప్రజాస్వామ్య దేశానికి పాలకులుగా పనికిరారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం కడప ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టీ. ఈశ్వర్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు విశ్వనాథనాయక్, ఎంఆర్‌పీఎస్ నాయకులు రామాంజనేయులు, రైతు సంఘం అన్నమయ్య జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, పౌర హక్కుల సంఘం న్యాయవాది రెడ్డెయ్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి, సుజాత, భారతి, సంధ్య, తులసి, రజక సంఘం నాయకులు శ్రీనివాసులు, రమేశ్, బంజారా సంఘం నాయకులు శంకర్‌నాయక్, జనసేన నాయకులు రామశ్రీనివాసులు, పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: రోడ్లపైనే అంగన్వాడీల నిరసనలు కొనసాగాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా భోగి పండుగ కూడా సమ్మె నిర్వహించే స్థలంలోనే జరుపుకున్నారు. రైల్వేకోడూరు అంగన్వాడీ సంఘం అధ్యక్షురాలు రమాదేవి ఆధ్వర్యంలో ఎస్మా జీవో-2 ప్రతులను కాల్చి వేశారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు తమ ఉద్యమాలు ఆపే ప్రసక్తి లేదన్నారు. ఈ కార్యక్రమం లో రైల్వేకోడూరు అంగన్వాడీ సంఘం నాయకురాళ్లు శిరీషా, లీలా, పద్మ, దుర్గా ఐదు మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: ప్రభుత్వం విధుల్లో చేరాలని ఇచ్చిన జీవోలను భోగిమంటల్లో కాల్చివేశారు. ప్రాజెక్టు అధ్యక్షుడు సుకుమార్, ప్రధాన కార్యదర్శి ప్రభావతి సెక్టారు లీడర్లు లక్ష్మీదేవి, నాగమణి, శిరీష, ఎరుగమ్మ, శ్రీవాణి, రుక్మిణి, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

రాజంపేట: తెలుగు ప్రజల పెద్ద పండుగ భోగి పండుగ రోజు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ సమస్యలు పరిష్కరించాలని 34వ రోజు నిరసన దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా ఎస్మా కాపీలను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. జీవో నెంబరు రెండును రద్దు చేయాలని ు నినాదాలు చేశారు. ఇంత దుర్మార్గంగా వ్యవహరించడం ప్రభుత్వానికి సిగ్గుచేటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరమ్మ, విజయలక్ష్మీ, అమరావతి, శివరంజిని, జోత్స్న, గౌసియా, మమత తదితరులు పాల్గొన్నారు.

సీఎంగా జగన్‌కు ఇదే ఆఖరి సంక్రాంతి

- టీడీపీ పార్లమెంటరీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం

సుండుపల్లె, జనవరి 14: రాష్ట్ర ప్రజలు తెలుగుదేశం ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని, సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డికి ఇదే ఆఖరి సంక్రాంతి అని జెడ్పీ మాజీ చైర్మన్, టీడీపీ పార్లమెంటరీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. మండలంలోని బలిజపల్లెలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన తాడు లాడుగు పోటీలకు ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వానికి రోజులు చెల్లిపోయాయని, ప్రజలు చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అరాచకాలు, అక్రమాలు చేస్తున్న ఈ ప్రభుత్వాన్ని ఈ సంక్రాంతితో రాష్ట్రం నుంచి వెలివేయాలన్నారు. జగన్ పాలనలో కాపులకు తీరని అన్యాయం జరిగిందని, రానున్న ఎన్నికల్లో మన సత్తా ఏంటో నిరూపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి శివకుమార్‌నాయుడు, దామోదర్‌నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు చిట్టెం రామచంద్ర, ప్రతాప్‌రెడ్డి, చెన్నంశెట్టి వెంకట్రమణ, రామాంజులు, మేకల మహబూబ్ బాషా, యర్రంరెడ్డి, చాన్‌బాషా, రామయ్య, మాజీ ఎంపీటీసీ మోహన, పోకల సిద్దయ్య, మునిస్వామి, జనసేన మండల నాయకులు రామశ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: భోగి పండుగ సందర్భంగా ఆదివారం రాయచోటి పట్టణంతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాల ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయం, సాయి బాబా మందిరం తదితర ప్రాంతాల్లో భోగి మంటలు వేశారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రమేశ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భోగి మంటలు వేసి సంకాంత్రి లక్ష్మికి స్వాగతం పలకడంతో పాటు రాష్ట్రంలో సాగుతున్న రాక్షస పాలన భోగి మంటల్లో పడి కాలి బూడిద కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన పోయినప్పుడే తెలుగు ప్రజలకు నిజమైన సంక్రాంతి పండుగ అన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పల్లెల్లో భోగి పండుగ మంటలతో సంక్రాంతి సందడి మొదలైంది. భద్రకాళీ సమేత వీరభద్ర ఆలయంలో అర్చకులు వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు, నియోజకవర్గ టీడీపీ నాయకులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోమోహన్‌రాజు రాయచోటి నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

రైల్వేకోడూరు: సంక్రాంతి సంబరాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున భోగి మంటలు వేసుకున్నారు. రైల్వేకోడూరు టీడీపీ కార్యాలయం ఎదుట ఏపీ సీఎం విడుదల చేసి ప్రజా వ్యతిరేక చట్టాల ప్రతులను టీడీపీ నాయకులు కొమ్మా శివ, నార్జాల హేమరాజ్, గడికోట సుబ్బరాయుడు, రాజ, తేనేపల్లి చిన్నా, మహిళా నాయకురాలు బాలు ఇందిరమ్మ తదితరులు కాల్చివేశారు. టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ నాగవరంలో వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త ముక్కా రూపానందరెడ్డి ముక్కావారిపల్లెలో తన కుటుంబ సభ్యులతో కలసి వైసీపీ ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. జరుపుకున్నారు. రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌ఛార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు తిరుపతి లోని తన నివాసంలో వైసీపీ పాలన అంతం కావాలని సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు.

వీరబల్లి: వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక జీవో ప్రతులను తెలుగుదేశం పార్టీ శ్రేణులు మండల కేంద్రంలో పార్టీ కార్యాలయం వద్ద భోగి మంటల్లో ఆహుతి చేశారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు భోగి పండుగ సందర్భంగా వైసీపీ ప్రభుత్వ జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేసి సైకో పోవాలి.. సైకిల్ రావాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వీరబల్లి మండల టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలు అన్ని ప్రజలకు వ్యతిరేకంగా తీసుకొచ్చినవేనని ఆయన వివర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జయచంద్రారెడ్డి, వీరబల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు ఆంజనేయులురెడ్డి, టీడీపీ యువనాయకులు ధీరజ్‌రెడ్డి, ఐటీడీపీ పవన్, శివకుమార్, వినయ్, నరసింహులు, మహేశ్, బీసీ నాయకులు సుబ్బరామయ్య, కేంపల్లె రమణ, గిరి తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపుతో రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు వస్తాయని టీడీపీ పార్లమెంట్ వాణిజ్య వి భాగం అధికార ప్రతినిధి దామోర్‌నాయుడు తెలిపారు. సోమవారం వైసీపీ అరాచక పాలన దూరం కావాలని సుండుపల్లె మండల కేంద్రంలో భోగి మంటలను వేశారు. రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు రావాలని, అది టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడుతోనే సాధ్యం అన్నారు. మండల మైనార్టీ నాయకులు మేకల మహబూబ్‌బాషా, మండల ఉపాధ్యక్షుడు యర్రంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజానాయుడు, బలరామరాజు, జనసేన నాయకులు, రామ శ్రీనివాసులు పాల్గొన్నారు.


సుండుపల్లె : వైసీపీ అరాచక పాలనకు భోగిమంటలతో సుండుపల్లెలో నిరసన తెలుపుతున్న టీడీపీ, జనసేన నాయకులు


సుండుపల్లె : తాడులాగుడు పోటీలు ప్రారంభిస్తున్న సుగవాసి


రాయచోటి టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భోగి మంటలు వేస్తున్న కార్యకర్తలు


రైల్వేకోడూరు టీడీపీ కార్యాలయం ఎదుట జీవో ప్రతులను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు


వీరబల్లి:జీవో ప్రతులను దహనం చేస్తున్న టీడీపీ నేతలు

పోలి వేణుగోపాలస్వామి ఆలయంలో 'స్వచ్ఛభారత్'



వేణుగోపాలస్వామి ఆలయాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

రాజంపేట, జనవరి 14 : మండలంలోని పోలి చెరువు కట్ట సమీపంలో ఉన్న వేణుగోపాలస్వామి ఆల యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ ఆంధ్ర రాష్ట్ర సంఘటన మంత్రి రవీంద్రరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న రామమందిర ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు, దేశంలోని అన్ని దేవాలయాల్లో, పుణ్య క్షేత్రాలను , గుడిని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పిండిబోయిన కృష్ణ యాదవ్, కార్యదర్శి సమ్మెట నరేంద్రరాజు, కోడూరు కో-కన్వీనర్ గాదెల శ్రీనివాసులు, వైబీఎస్ఐ జిల్లా కో-ఆర్డినేటర్ కోడూరు ఆదినారాయణ, చిన్న రాఘవ, సునీల్‌రెడ్డి, శరత్, పుష్కర్, మానస, తోట రామయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నముక్కపల్లెలో పేదలకు దుస్తుల పంపిణీ

రాయచోటిటౌన్, జనవరి14: సంక్రాంతి పండుగ సందర్భంగా రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ మమత దంపతులు గ్రామంలోని పేద ప్రజలకు దుస్తులు పంపిణీ చేశారు. ఆదివారం ఆయన స్వగ్రామంలో గ్రామంలోని 100 మంది మహిళలకు చీరలు, 100 మంది పురుషులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సంతోషంగా జరుపుకోవాలన్న లక్ష్యంతో ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ రోజు దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సంక్రాంతి పండుగ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చెన్నముక్కపల్లెలో 1, 2 పంచాయతీ కార్యదర్శులు రామచంద్ర, పవన, చిన్నప్పరెడ్డి, ఉదయ్, అప్పా సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నల్లగంగమ్మ సన్నిధిలో ఆర్డీవో


నల్లగంగమ్మను దర్శించుకుంటున్న ఆర్డీవో మురళి

సంబేపల్లె, జనవరి14: దేవరరాయి నల్లగంగమ్మ తల్లిని ఆదివారం మదనపల్లె ఆర్డీవో మురళి కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా . అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఈవో కొండారెడ్డి, సంఘ సేవకుడు గుండ్రే భువనేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా క్రికెట్ టోర్నమెంట్లు

ఒంటిమిట్ట, జనవరి14 : సంక్రాంతి పురస్కరించుకొని మండల పరిధిలోని రాచపల్లెలో గంటా నరహరి ఆధ్వర్యంలో పది రోజులుగా నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఈసందర్భంగా రాజంపేట టీడీపీ నాయకులు గంటా నరహరి ఫైనల్ మ్యాచ్ తిలకించి విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. గ్రామీణ విద్యార్థులు యువతను ఉత్సాహ పరిచేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతగా నిలిచిన ఒంటిమిట్ట ఫ్రెండ్స్ జట్టుకు రూ. 40వేలు,రన్నర్స్‌గా నిలిచిన గొల్లపల్లె జట్టుకు రూ. 30 వేలు, మూడో స్థానంలో నిలిచినఒంటిమిట్ట కరెంటు టీంకు పది వేల రూపాయల నగదును గంటా నరహరి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో యువత విద్యార్థులు చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలని సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, రాజంపేట మండల అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య, పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి, పసుపులేటి రమణ, క్రీడాకారులు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నందలూరు: క్రీడలతో మానసిక వికాసం కలుగుతుందని రాజంపేట నియోజకవర్గ జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజు తెలిపారు. ఆదివారం నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని రబ్బర్ బాల్ క్రికెట్ టోర్నమెంటును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ పోటీలలో విన్నర్స్‌కు రూ. 15 వేలు, రన్నర్స్‌కు రూ. 10 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, నాయకులు ఆకుల చలపతి, కమిటీ సభ్యులు మణి, కాశీ, వెంకటేష్, ఎం.సుబ్రమణ్యం, లక్ష్మీనారాయణ, శివ, భార్గవ్, సుబ్రమణ్యం, షంషీర్, వై.సుబ్రమణ్యం, సుబ్బు, అస్లాం, తల్హా, నవీన్, శివ, సాయి పాల్గొన్నారు.

నందలూరు: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని చుక్కా వెంకటయ్య ముదిరాజ్, వెంకటేశ్వరయ్య, యానాది ముదిరాజ్ తెలిపారు. మండలంలోని మదన మోహనాపురం గ్రామ పంచాయతీ, చింతకాయల పల్లె గ్రౌండ్‌లో ఆదివారం వారు క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ టోర్నమెంటులో గెలిచిన వారికి రూ. 50 వేలు, రన్నర్స్‌కు రూ. 30 వేలు అందించనున్నట్లు తెలిపారు. ప్రారంభ మ్యాచ్‌లో చుక్కాయపల్లె జట్టుపై చింతకాయలపల్లె జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం నల్లతిమ్మయ్యగారి పల్లె, మిద్దెల మధ్య జరిగిన పోటీలో మిద్దెల టీం విజయ దుందుభి మోగించింది. ఈ పోటీలకు ఆర్గనైజర్లుగా చుక్కా రమణయ్య, చింతకాయల ఉపేంద్ర, కడప చిన్ని కృష్ణ, బోయిన హరిబాబు, చింతకాయల వెంకటేష్, చింతకాయపల్లె యూత్ పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలను తిలకిస్తున్న గంటా నరహరి


నందలూరు: పోటీలను ప్రారంభించి క్రికెట్ ఆడుతున్న యల్లటూరు శ్రీనివాసరాజు


నందలూరు: క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వెంకటయ్య ముదిరాజ్, వెంకటేశ్వరయ్య, యానాది ముదిరాజ్

ప్రజలకు నేతల సంక్రాంతి శుభాకాంక్షలు

ఓబులవారిపల్లె, జనవరి14 : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో వెలుగొందాలని ఆకాంక్షిస్తున్నట్లు మాజీ ఎంపీపీ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు తెలిపారు. ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ నియోజకవర్గంలోని ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

భోగి రోజు అంగన్వాడీల నిరసన


మదనపల్లె ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ముగ్గులు పెట్టి నిరసనలు తెలుపుతున్న అంగన్వాడీలు


వాల్మీకిపురంలో భోగి మంటలతో నిరసనలు తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు


తంబళ్లపల్లెలో భోగి మంటల్లో జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు


బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

మదనపల్లె టౌన్, జనవరి 14: పండుగ పూట కూడా తమను ఇబ్బం దులకు గురిచేస్తున్న వైసీపీ ప్రభుత్వ తీరుకు నిరసనగా అంగన్వాడీలు భోగి పండుగ రోజు షోకాజ్ నోటీసులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఆదివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకుడు హరీంద్రనాథ్‌శర్మ మాట్లాడుతూ అక్క, చెల్లెమ్మలను ఆదుకుంటామని హామీ ఇచ్చిన సీఎం జగన్ నాలుగున్నరేళ్లు దాటుతున్నా అంగన్వాడీ సమస్యలను పరిష్కరించలేదన్నారు. షోకాజ్ నోటీసులు ఇచ్చినా అంగన్వాడీలు భయ పడే పరిస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకురాళ్లు మధురవాణి, గంగాదేవి, రాజేశ్వరి పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: కనీస వేతనాల విషయంలో గత 33రోజులుగా పోరాడుతుంటే సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ఏమాత్రం కనికరం లేకుండా పోయిందని వాల్మీకిపురంలో అంగన్వాడీ కార్యకర్తలు నిరసనలు తెలియజేశారు. ఆదివారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు ముగ్గులు వేసి భోగి మంటలతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్‌కు అంగన్వాడీలంటే కనికరం లేకుండా పోయిందని పండుగ పూట రోడ్ల పాలు చేసి దినదినం ఇబ్బందులకు గురి చేస్తున్నారే తప్ప తమ కనీస వేతనాలు, డిమాండ్ల పరిష్కారం చొరవ చూపడం లేదని విమర్శించారు. ప్రభుత్వానికి రాబోవు రోజుల్లో అంగన్వాడీల సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ అంగన్వాడీ యూనియన్ లీడర్లు చంద్రావతి, భువనేశ్వరి, ప్రసన్న, అమ్మాజీ, దేవసేన, లక్ష్మీనరసమ్మ, రెడ్డిరాణి, వాల్మీకిపురం, కలికిరి, గుర్రంకొండ మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ వర్కర్లు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెలో బాగంగా 34వ రోజైన ఆదివారం ప్రభుత్వం జారీ చేసిన ఎస్మా జీవోను, సోకాజ్ నోటీసుల ప్రతులను అంగన్వాడీలు భోగి మంటల్లో వేసి దహనం చేసి నిరసన తెలిపారు. ఆదివారం తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు, హెల్పర్లు తంబళ్లపల్లె మూడు రోడ్ల కూడలిలో సమ్మె శిబిరం వద్ద బైఠాయించి నిరసన చేపట్టారు. ప్రభుత్వం జారీ చేసిన ఎస్మా, జీవో నెం:2 ప్రతులను భోగి మంటల్లో వేసి తగుల బెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించకుండా సమ్మెను అణచివేయడానికి షోకాజు నోటీసులు, ఎస్మా జీవోను తీసుకొచ్చి నిర్బంధించాలని చూడటం సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు కరుణశ్రీ, ఉమాదేవి, సరస్వతీ, గౌరి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఆదివారం 34 వ రోజు అంగన్వాడీ కార్యకర్తల సమ్మె కొనసాగింది. కార్యాలయం ముందు బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు నశించాలని నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 2, అంగన్వాడీ కార్యకర్తలకు పంపిన నోటీసుల ప్రతులను భోగి మంటలను వేసి తగుల బెట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు శివజ్యోతి, నిలిమా, కుమారి తదితరులు మాట్లాడుతూ నెల రోజులకు పైబడి తాము ధర్నాలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం దయచూపక పోవడం దారుణమన్నారు. జీతాలు జూన్‌లో పెంచుతామని చెప్పుతున్న ప్రభుత్వం ఆ మేరకు జీవో ఇస్తే తాము తక్షణమే ధర్నాను విరమిస్తామన్నారు.

చంద్రబాబును కలిసిన శ్రీరామ్‌చినబాబు



మదనపల్లె టౌన్, జనవరి 14: సంక్రాంతి పురస్కరించుకుని ఆదివారం తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెకు చేరుకున్న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు మర్యాదపూర్వకంగా కలిశారు.ఇందులో భాగంగా శుభాకాంక్షలు తెలిపామని చినబాబు పేర్కొన్నారు. దీంతో పాటు మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లెతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా తెలుగు యువత చేపట్టిన కార్యక్రమాల గురించి చంద్రబాబుకు వివరించామన్నారు.

బాపట్లలో వీసీకే పార్టీ సదస్సు

మదనపల్లె టౌన్, జనవరి 14: వీసీకే పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 18న బాపట్లలో నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ తెలిపారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తున్న నేపథ్యంలో చెన్నైలో రెండు రోజుల పాటు వీసీకే పార్టీ జాతీయ అధ్యక్షుడు తిరుమాళవన్ ఆదేశాలతో సమావేశాలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా వీసీకే పార్టీ పోటీ చేయనున్న ఆరు పార్లమెంట్ స్థానాలు, 50 అసెంబ్లీ స్థానాలకు ఎంపిక చేసి వాటికి ఇన్చార్జిలను నియమించారన్నారు. ఈ నియోజకవర్గ ఇన్‌చార్జిలకు బాపట్లలో జరిగే సదస్సులో బూత్ లెవెల్ కమిటీల ఏర్పాటు, శిక్షణ ఉంటాయన్నారు.

వడ్డెర సంఘం నూతన కార్యవర్గం

బి.కొత్తకోట జనవరి 14 : బి.కొత్తకోటలో అన్నమయ్య జిల్లా వడ్డెర సాధికార కమిటీ అధ్యక్షుడు డేరంగుల నారాయణ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బి.కొత్తకోట మండల వడ్డెర సంఘం అధ్యక్షుడిగా తమ్మిశెట్టి పద్మనాభం, తంబళ్లపల్లె నియోజక వర్గ కన్వీనర్‌గా నాగమల్లప్ప, కార్యదర్శిగా నాగరాజుతో పాటు ఇతర కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ జిల్లా లోని అన్ని మండలాలు, గ్రామాలకు కమిటీలు వేస్తామన్నారు. బి. రవి, రామచంద్ర, చంద్రశేఖర్, చౌడప్ప, ఓబులేసు, నాగమల్లప్ప పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీకృష్ణ, గోదాదేవిల కల్యాణం


గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

మదనపల్లె అర్బన్, జనవరి 14: బర్మావీధిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం శ్రీకృష్ణ, గోదా దేవిల కల్యాణం కన్నుల పండువగా కమనీయంగా జరిగింది. ఆలయకమిటీ ఉపాధ్యక్షుడు నాదేళ్ల బాబు నాయుడు ఆధ్వర్యంలో ఉదయం ఉత్సవ విగ్రహాలను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోదాదేవి కల్యాణం అత్యంతవైభవంగా నిర్వహించారు. మదనపల్లె పట్టణ, పరిసరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు మార్పురి నాగార్జునబాబు పాల్గొన్నారు. కాగా సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం మదనపల్లె వాసవీ క్లబ్ ఉపాధ్యక్ష, కార్యదర్శులు వీవీకృష్ణారావు, పొన్నగంటి అమర నాథ్‌ల ఆధ్వర్యంలో తెట్టు వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. అనంతరం సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ కోశాధికారి లక్ష్మీదీపక్, ఐఈసీ అధికారులు, మాజీ కమిటీ సభ్యులు తెట్టుగ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు

● ప్రతి ఇంటిముంగిట భోగి మంటలు వేసి వేడుకలు చేసుకున్న జనం ● రంగవల్లులతో శోభిల్లిన పల్లెలు, పట్టణాలు


మదనపల్లె పట్టణ శివనగర్‌లో సామూహికంగా భోగిమంటలు వేస్తున్న ప్రజలు

మదనపల్లె అర్బన్, జనవరి 14: సంక్రాంతి పండుగ సంబరాలు అంగరంగ వైభవంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. భోగి పండుగతో ప్రారంభమై సంక్రాంతి, కనుమ పండుగతో మూడు రోజుల పాటు పండుగ వేడుకలను గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ ప్రాంతాల్లో ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు. తొలి రోజు నిర్వహించే భోగి పండుగను మదనపల్లె పట్టణం, రూరల్ మండలంలో ప్రజలు భోగి మంటలు వేసి పండుగ వేడుకలు నిర్వహించారు. భోగి భోగభాగ్యాలను తేస్తుందనే నానుడి ప్రజల్లో ఉండడంతో అందురూ వేకువజామున నిద్రలేచి తమ ఇళ్లముంగిళ్లలో భోగిమంటలు వేశారు. మండలంలోని వెలుగు ప్రత్యేక పాఠశాలో భోగిమంటలు వేశారు. భోగిపండుగను పురష్కరించుకుని స్థానిక ఓంశక్తి ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలుస్వామి, నవీన్‌చౌదరి, నాదేళ్లశివన్న, రఘుపతినాయుడు, మల్లికార్జుననాయుడు, శ్రీరామ్‌వినోద్‌కుమార్, రసూల్, మంజునాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు. సంక్రాంతి కోసం దూరప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యోగులు, ప్రయాణికులతో మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయా ణికుల సందడి నెలకొంది.

పీలేరులో: సంక్రాంతి పండుగ తొలి రోజైన భోగి పండుగను పీలేరు ప్రజలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునే సాంప్రదాయబద్ధంగా తమ లోగిళ్ల ముందు భోగి మంటలు వేసి పండుగకు స్వాగతం పలికారు. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ భోగి సంబరాల్లో పాల్గొన్నారు. స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం ముందు ఆర్యవైశ్య సంఘం, మహిళా మండలి, వాసవీ క్లబ్ గ్రేటర్, వాసవీ కపుల్స్ క్లబ్ సభ్యులు భోగి మంటలు వేసి దాని చుట్టూ కోలాటాలతో పండుగను వైభవంగా జరుపుకున్నారు. అం వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘం నాయకులు కూనా సత్యం, మహాలక్ష్మి, శివఫణేశ్, సోమిశెట్టి సురేశ్, పామిడి మల్లిఖార్జున, జూటూరు అరవింద్, జయచంద్ర, గణపతి, సకల రమేశ్, మహేశ్, భగవాన్, శ్రీలత, ఉషా, సుప్రజ, శ్రీదేవి, సునీత, కృష్ణవేణి పాల్గొన్నారు.

గుర్రంకొండలో: మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి వేడుకలను ప్రజలు ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఇళ్ల ముందు ప్రజలు భోగి మంటలను వేసి అందులో ఇళ్లలోని పాత వస్తువులను వేసి పండుగను జరుపుకున్నారు. గ్రామాల్లో పండుగ సందర్భంగా ప్రతి ఇల్లు బంధువులతో కోలాహలంగా ఉన్నాయి.

కలకడలో: సంక్రాంతిలో భాగమైన భోగి పండుగను మండల ప్రజలు ఆదివారం వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేకువ జామునే ఇళ్ల వద్ద భోగి మంటలు వేసి రాబోయే ఉత్తరాయణ కాలంలో తమ కుటుంబాల్లో సుఖసంతోషాలు ఉండాలని కోరుకున్నారు. అలాగే మహిళలు ప్రత్యేకంగా ఇంటి లోగిళ్లలో రంగు రంగుల ముగ్గులు వేసి వాటి మధ్యలో గొబ్బెమ్మలను ఉంచి పండుగ శోభ సంతరింపజేశారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండల వ్యాప్తంగా ఆదివారం భోగి పండుగ వేడుకలు ఎంతో వైభవంగా జరుపుకున్నారు. పట్టణంలోని ప్రతి ఇంటి ముంగిట భోగి మంటలు వేసి ప్రజలు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రతి ఇంటి ముంగిట రంగవల్లులతో సంక్రాంతి శోభ సంతరించుకుంది.

కురబలకోటలో: కురబలకోట మండలంలో పలు గ్రామాల్లో భోగి వేడుకలను ప్రజలు ఆదివారం వేకువజామున ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం రావాలని రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ ఆధ్వర్యంలో భోగి మంటలు వేసి దేవుడిని వేడుకున్నారు. అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు.

తంబళ్లపల్లెలో: తెలుగువారి సంప్రదాయానికి ప్రతీక సంక్రాంతి పండుగ మొదటి రోజైన భోగి పండుగను ఆదివారం మండల ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. మహిళలు ఇళ్ల ముందు ముగ్గు లు వేసి వాటి మధ్యలో గొబ్బెమ్మలు అలంకరించి పూజలు చేశారు.

భోగి మంటల్లో చీకటి జీవోలు దహనం


టీడీపీ కార్యాలయంలో భోగి మంటల్లో నవరత్నాల మేనిఫెస్టో, జీవో ప్రతులను దగ్ధం చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

మదనపల్లె టౌన్, జనవరి 14: వైసీపీ పాలనలో వచ్చిన చీకటి జీవోలను భోగి మంటల్లో దహ నం చేస్తున్నామని మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ పేర్కొన్నా రు. ఆదివారం స్థానిక అన్నమ య్య సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో ఆదివారం భోగి పం డుగ సందర్భంగా మంటలు వేసి జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా దొమ్మలపాటి మాట్లాడుతూ వైసీపీ పాలనపై విసిగి వేసారిపోయిన ప్రజల కు రా.. కదలిరా.. అంటూ చంద్రబాబును, టీడీపీని అహ్వానిస్తున్నారన్నారు. జనసేన నియోజకవర్గ నాయకుడు శ్రీరామ రామాంజ నేయులు మాట్లాడుతూ చంద్రబాబు అనుభవం, పవన్‌కళ్యాణ్ ఉత్సాహంతో రాష్ట్రంలో టీడీపీ, జనసేన అధికారం లోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు చాణుక్యతేజ, భవానిప్రసాద్, ఆర్‌జే వెంకటేశ్, నరసింహులు, రెడ్డిశేఖర్, కొండ్రెడ్డి, కత్తి లక్ష్మన్న, జనసేన నాయకులు దారం అనిత, హరిహరన్, మైథిలి పాల్గొన్నారు.

ఏపీకి పట్టిన గ్రహణం పోవాలి... టీడీపీ రావాలి


ప్లకార్డులను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

బి.కొత్తకోట జనవరి 14 : ఆంధ్రప్రదేశ్‌కు పట్టిన గ్రహణం వీడిపోయి, టీడీపీ రావాలని ఆపార్టీ నాయకులు ఆకాంక్షించారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఆదివారం ఉదయం బి.కొత్తకోట పట్టణంలోని జ్యోతి బస్టాండు సర్కిల్ లో భోగి మంటలను వేశారు. రాష్ట్రంలోని వివిధ సమస్యలపై వచ్చిన చీకటి జీవోలను ఆ మంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చి, చంద్రబాబు నాయుడు మళ్లీ ముఖ్యమంత్రి పదవి చేపట్టి వచ్చే సంక్రాంతి ని రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జరుపుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎండీ మస్తాన్, సురేంద్ర, రాజా, రంజిత్‌కుమార్, మహేశ్ నాయుడు పాల్గొన్నారు.


జీవో ప్రతులను దహనం చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

పెద్దతిప్పసముద్రంలో: మండల కేంద్రమైన పీటీఎంలో భోగి పండుగ సందర్భంగా ఏపీకి పట్టిన కీడు తొలగాలని కోరుకుంటూ రాష్ట్ర సమస్యల ఫోటోలను, పత్రాలను, ప్లకార్డులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. రాష్ట్రంలో ఆరాచక పాలన సాగుతోందని, ఆరాచక పాలనకు అంతం పలకాలని, టీడీపీ జనసేన నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని భోగి మంటలు వేసి వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరనాదాలు చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శివానంద, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు దొరిగుండ్ల శంకర, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కత్తి ఆదినారాయణ, చింతకాయల వినోద్, రాము, కత్తి అనిల్, సప్పు రాజు, వక్కల ఆంజప్ప, కరెంటు శివ, కాలిశెట్టి సుధాకర్, గంగిరెడ్డి, దొరిగుండ్ల శీనా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు తక్షణం పరిష్కరించండి


భోగి మంటల్లో డిమాండ్ ప్రతులు దహనం చేస్తున్న ఉపాధ్యాయులు

పీలేరు, జనవరి 14: ఉపాధ్యాయుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమేరకు తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి పలుమార్లు అందజేసిన డిమాండ్ల ప్రతులను భోగి మంటల్లో వేసి ఆదివారం యూటీఎఫ్ నాయకులు తమ నిరసన వ్యక్తం చేశారు. పీలేరులోని నాలుగు రోడ్ల కూడలిలో భోగి మంటలు ఏర్పాటు చేసి డిమాండ్ల ప్రతులను అందులో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తమకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, 12వ పీఆర్‌సీకి సంబంధించిన 30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ సదాశివరెడ్డి, హెచ్‌ఎం ల సంఘం అధ్యక్షుడు మోడెం చెంగల్రాయులు, నాయకులు చంద్రశేఖర్, విశ్వనాథరెడ్డి, రాధాకృష్ణ, రేగంటి సుధాకర్, వెంకటరమణ, రమేశ్ రెడ్డి, ఉదయ్ కిరణ్, దేవేందర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, జయరాం పాల్గొన్నారు.

రాజ్యాధికారం సాధిస్తేనే బడుగులకు భవిష్యత్

మదనపల్లె అర్బన్, జనవరి 14: రాజ్యాధికారం సాధిస్తేనే బడుగు బలహీన వర్గాలకు భవిష్యత్ ఉం టుందని బీసీహక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బోడెం రాజశే ఖర్ పేర్కొన్నారు. ఆదివారం స్థాని క ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగుబలహీన వర్గాలు అధికంగా ఉన్న మదనపల్లె నియోజకవర్గంలో ఏ రాజకీయ పార్టీ కూడా గుర్తించి బీసీలకు స్థానం కలిపించలేదని వాపోయారు. రాష్ట్రంలో బడుగుబలహీన వర్గాలకు రాజ్యా ధికారం అవసరాన్ని తెలియజేస్తూ సదస్సుల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామ న్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో తమ అభ్యర్థులు పోటీకి ముందుంటారని ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నగినేని గోవిందు, ఉమ్మడిజిల్లా ప్రధాన కార్యదర్శి బోమ్మనపల్లె లక్ష్మన్న, నాయకులు వైవీశేఖర్‌నాయుడు, చిన్నరెడ్డెప్ప, అమానుల్లా, రామకృష్ణ, నారాయణస్వామి, చంద్రయ్య, నాగేంద్ర, మల్లికార్జు న, ఖాదరవల్లి, వెంకటరమణ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

భూమి కాజేసిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

నిమ్మనపల్లి, జనవరి 14: దొంగ పత్రాలు సృష్టించి వేరొకరి భూమిని తన పేరున రిజి స్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా ఆ భూమి చుట్టూ కంచెను కూడా ఏర్పాటు చేయడంపై ఆదివారం సంబంధిత పంచాయతి కార్యదర్శి మారెప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రెడ్డివారిపల్లి పంచాయతి ఎనుగొండవాఙిపల్లికి చెందిన శేషాచలనాయుడు కుమారుడు లోకేష్‌నాయుడు తన వద్దకు వచ్చి బ్యాం క్ లోన్ కొరకు ఇంటిపన్ను ధ్రువపత్రము కావాలని కోరగా ఇచ్చామన్నారు. అయితే అతను తనను మోసగించి ఖాళీజాగాకు కూడా ఇంటి పన్నును తీసుకొన్నట్లు తెలిపారు. ఆ ధ్రువపత్రంతో మదనపల్లి సబ్‌రిజిస్ట్రారుతో భూమిని డిసెంబరులో రిజిస్ట్రేషన్ చేసుకొన్నాడన్నారు. దీంతో తనను మోసం చేసి ఇంటి పన్నుతో రిజి స్ట్రేషన్ చేసుకొన్న లోకేష్‌నాయుడుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కార్యదర్శి పేర్కొన్నారు.

267 పోస్టులకు 5,750 దరఖాస్తులు

మదనపల్లె టౌన్, జనవరి 14: మదనపల్లె ప్రభుత్వాస్పత్రి, మెడికల్ కాలేజిలో భర్తీ చేయనున్న 267 ఉద్యోగాలకు 5,750 మంది దరఖాస్తు చేసుకున్నట్లు మెడికల్ కాలేజి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీధర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గత సోమవారం నుంచి నేటి వరకు దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఇందులో 33 కేటగిరిల్లోని ఉద్యోగాలకు ప్రభుత్వాస్పత్రిలో 202 ఉద్యోగాలు, మెడికల్ కాలేజిలో 65 పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఈ దరఖాస్తులను మెంటర్ కాలేజి అయిన తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కాలేజికి పంపుతామన్నారు. త్వరలోనే ఇంటర్వ్యూ తేదీలను తెలియజేస్తామని మురళీధర్ తెలిపారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

మదనపల్లె టౌన్, జనవరి 14: మదనపల్లె మండలం కురవంక పంచయతీలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.5లక్షలతో పనులు చేయిస్తున్నట్లు సర్పంచ్ చిప్పిలి చలపతి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక భువనేశ్వరి నగర్‌లో తాగునీటి సరఫరా కోసం కొత్తగా పైప్‌లైన్ పనులను సర్పంచ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం..మహిళ అరెస్ట్

నిమ్మనపల్లి, జనవరి 14: గుట్టుచప్పుడు కాకుండా నాటుసారాను విక్రయిస్తున్న అలివేలమ్మ(38)అనే మహిళ వద్ద నుంచి 12లీటర్ల సారా స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పెద్దమాదిగపల్లి గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు నిర్వహించి రమణ భార్య అలివేలమ్మపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

నాటు కోళ్ల కోసం ఎగబడిన జనం

● కిటకిటలాడిన పీలేరు వారపు సంత


కిటకిటలాడిన పీలేరు నాటు కోళ్లు, పుంజుల వారపు సంత

పీలేరు, జనవరి 14: సంక్రాంతి పండుగ అంటేనే స్పెషల్ నాటుకోడి కూర, దోసెలు, ఉద్ది వడలు. అందుకోసం నాటు కోళ్లను కొనుగోలు చేసేందుకు ఆదివారం ఉదయం 5 గంటల నుంచే చాలామంది ప్రజలు ప్రతి ఆదివారం జరిగే పీలేరు పశువులు, కోళ్ల వారపు సంత ప్రాంగణానికి చేరుకున్నారు. దీంతో సంత ప్రాంగణం కిటకిటలాడింది. సగటున కిలో నాటుకోడి రూ.600 నుంచి రూ.1000 వరకు పలికింది. ఇక పుంజుల సంగతి చెప్పక్కర్లేదు. జాతిని, బరువును బట్టి రూ.3 వేల నుంచి రూ.9 వేల వరకు పలికాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా జరిగే కోడి పందేల కోసం పుంజులను కొనుగోలు చేసేందుకు శ్రీకాళహస్తి, కడప, పులివెందుల, గుంటూరు వంటి ప్రాంతాల నుంచి వ్యాపారులు తరలివచ్చారు. కొంతమంది తమ పుంజుల సత్తా చాటేందుకు అక్కడే వాటికి పోటీలు పెట్టారు. పీలేరు మండలంలోని దొడ్డిపల్లె, రేగళ్లు, గూడరేవుపల్లె, తలపుల, మేళ్లచెరువు పంచాయతీల్లోని పలు గ్రామాల్లో ఆదివారం కోడి పందేలు జోరుగా సాగాయి. అధికార పార్టీ నాయకులు పందెంరాయుళ్లకు అభయమిచ్చి మరీ తమ గ్రామాల్లో వాటిని ఏర్పాటు చేయించారు. పీలేరు మండలంతో పాటు పొరుగున ఉన్న సదుం, సోమల, కలికిరి మండలాలకు చెందిన పలువురు పందెంరాయుళ్లు అక్కడకు చేరుకుని పందేలలో పాల్గొన్నారు.

ప్రధానమంత్రి 15 పాయింట్ల జిల్లా కమిటీ సభ్యుడిగా మహమ్మద్ మాలిక్

బి.కొత్తకోట జనవరి 14 : జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే ప్రధానమంత్రి 15 పాయింట్ల జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యుడిగా బి.కొత్తకోటకు చెందిన మాజీ ఉప సర్పంచ్ పి. మహమ్మద్ మాలిక్ నియమితులయ్యారు. జిల్లాలో మైనారిటీ కోటాలో కార్యవర్గ సభ్యులుగా ముగ్గురు నియమితులు కాగా అందులో ముస్లిం కమ్యూనిటీ లో మహమ్మద్ మాలిక్‌ను తీసుకున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా మాలిక్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న ఈ ప్రధానమంత్రి అభివృద్ధి కమిటీలో తన దృష్టికి వచ్చిన ముస్లిం మైనారిటీల సమస్యలను కమిటీ సమావేశంలో లేవనెత్తి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన ఏంపీ, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, జనవరి 14:గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి రావడంతో పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నేడు అయ్యప్పస్వామి నగరోత్సవం..

వాల్మీకిపురం, జనవరి 14: వాల్మీకిపురం పట్టణంలోని కోనేటివీధిలో వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం సంక్రాంతి పండుగ, మకర జ్యోతి సందర్భంగా స్వామివారికి నగరోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో అయ్యప్ప స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. సాయంత్రం నూతన ఆలయ నిర్మాణ ప్రాంతంలో అయ్యప్ప మరకజ్యోతి దర్శన వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

కోడి పందెం శిబిరంపై దాడి - 10 మంది అరెస్టు

ములకలచెరువు, జనవరి 14: మండలంలోని సోంపల్లె పంచాయతీ అడివినాయనిచెరువుపల్లె సమీపంలో ఆదివారం కోడి పందెం శిబిరంపై దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ గాయత్రి తెలిపారు. ఈ సందర్భంగా 10 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.9,520ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే మూడు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కలకడ, జనవరి 14: స్థానిక చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగరాజనాయుడు అనే వ్యక్తికి తీవ్ర గాయలైయ్యాయి. కేవీపల్లి మండలం మల్లుకుంటపల్లికి చెందిన నాగరాజనాయుడు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా పీలేరు వైపు నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్రతం అతన్ని ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.